కేకే ఫ్రస్టేషన్‌తో మాట్లాడుతున్నడు

తంగళపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

- బీఆర్‌ఎస్ హయాంలో పంటలకు నీళ్లొస్తే.. మరీ ఇప్పుడుడెందుకు రావట్లే..
- ఇష్టారీతిన ఆరోపణలు చేస్తే సహించేదిలేదు
- బీఆర్‌ఎస్ సీనియర్ నేత మాట్ల మధు
- కనీసం ముస్తాబాద్ జడ్పీటీసీగా అయినా గెలువాలని సవాల్

సిరిసిల్ల రూరల్, మార్చి 6: కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, ఆ పార్టీ నాయకులు ఇష్టారీతిన మాట్లాడితే సహించేదిలేదని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు మాట్ల మధు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం తంగళపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ ఎంపీపీ పడిగెల మానస, ఫ్యాక్స్ వైస్ చైర్మన్ ఎగుమామిడి వెంకట రమణారెడ్డి, నాయకులతో కలిసి మాట్లాడారు. ఒక్క ప్రాజెక్ట్ కట్టలేదని మాట్లాడడం అవివేకమని, తమ ప్రభుత్వ హయాంలో పచ్చటి పొలాలతో కళకళలాడిన ఈ ప్రాంతం.. ఇప్పుడెందుకు నెర్రెలు పారుతుందో చెప్పాలన్నారు. కేటీఆర్ వచ్చినప్పుడల్లా ప్రెస్‌మీట్లు పెట్టే ఆది శ్రీనివాస్.. ముందుగా తన నియోజకవర్గాన్ని బాగు చేసుకుంటే మంచిదన్నారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై అనవసరంగా నోరుపారేసుకుంటే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. మతిస్థిమితం కోల్పోయి కేకే మహేందర్‌రెడ్డి మాట్లాడుతున్నాడని మండిపడ్డారు. కేటీఆర్‌ను తిడితే అయినా.. పదవి వస్తదనే ఆలోచన కేకే మహేందర్‌రెడ్డికి ఉన్నట్లుందని ఎద్దేవా చేశారు. మల్కపేట రిజర్వాయర్, అన్నపూర్ణ, మిడ్ మానేరు ప్రాజెక్టులు ఎవరూ కట్టించారో కూడా తెలియదా అని ప్రశ్నించారు. సిరిసిల్లను అన్నిరంగాల్లో సుభిక్షం చేసిన కేటీఆర్‌ను పట్టుకొని దుర్భాషలాడుతావా.. అంటూ ఫైర్ అయ్యారు. అమావాస్యకు ఓసారి సిరిసిల్లకు వచ్చే నువ్వు..మా నాయకుడిని విమర్శిస్తవా.. అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రంగనాయక సాగర్ ద్వారా మండలానికి నీళ్లు తేవడానికి కృషి చేసింది కేటీఆర్ అని చెప్పారు. తమ ప్రభుత్వ హయాంలో కాలువల ద్వారా నీలెట్ల వచ్చినయి.. ఇప్పుడేమైందని ప్రశ్నించారు. మీ అసమర్థత పాలతో రైతులు అరిగోస పడుతున్నారని వెల్లడించారు. డేరా బాబాలెక్క తిరుగుడు తప్ప సిరిసిల్లకు ఆది శ్రీనివాస్ ఏం చేసిండో చెప్పాలన్నారు. తట్టాబుట్టా సర్దుకుని సిరిసిల్ల నుంచి పోవుడు తప్ప కేకే మహేందర్‌రెడ్డికి మరో ఆప్షన్ లేదన్నారు. వార్డు మెంబర్‌గా కూడా గెలువనోళ్లు కేటీఆర్‌ను విమర్శించడం సిగ్గుచేటన్నారు. కనీసం ముస్తాబాద్ జడ్పీటీసీగా అయినా కేకే మహేందర్‌రెడ్డి గెలువాలని సవాల్ విసిరారు. సమావేశంలో మాజీ ఎంపీపీ పడిగెల మానస, మాజీ సర్పంచ్ కొయ్యడ రమేశ్, నేతలు ఎగువమామిడి రమణారెడ్డి, పడిగెల రాజు, బండి జగన్, ఇమ్మానేని అమర్ రావు, గుండు ప్రేమ్ కుమార్, కుర్మా రాజయ్య, మీసాల కృష్ణ, మసీపెద్ది శ్రీకాంత్‌రావు, కోడం సంధ్యా రాణి, జగత్, యాదా నరేశ్, నవీన్‌రెడ్డి, కందుకూరు రామాగౌడ్, కృష్ణారెడ్డి, ఎగుర్ల కర్ణాకర్, సయ్యద్ అఫ్రో జ్, బీమని అరవింద్, కిష్టారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మూఢనమ్మకాలు నమ్మవద్దు

- జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ సభ్యుడు సంపతి రమేశ్

వేములవాడ రూరల్, మార్చి 6: ప్రజలు మూఢనమ్మకాలు మోసపోవద్దని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ సభ్యులు సంపతి రమేశ్ సూచించారు. గురువారం వేములవాడ మండలం శాభాష్‌పల్లి గ్రామంలో చంద్రగిరి మహేందర్-సాహితి ఇంటి ఆవరణలో చేతబడి చేస్తున్నట్లు కోడిగుడ్ల, సామగ్రి ఉంచి భయభ్రాతులకు గురిచేస్తున్నారు. విషయం తెలుసుకున్న జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర సభ్యుడు సంపత్ రమేశ్ అక్కడి వెళ్లి చేతబడి గురించి వివరించారు. ప్రజలు చేతబడి నమ్ముతూ.. మంత్రగాళ్లను ఆశ్రయిస్తున్నారన్నారు. ప్రజలు ఇలాంటి వాటిని నమ్మి మోసపోవద్దన్నారు. ఇక్కడ జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి పార్యం లక్ష్మీనారాయణ, కమిటీ సభ్యులు కమటం మల్లయ్య, రవి, తదితరులు ఉన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా
- పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష

జిల్లా కేంద్రంలో పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్, ఎస్పీ

కలెక్టరేట్, మార్చి 6: జిల్లాలో రహదారుల, భవనాల నిర్మాణ పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. గురువారం సమీకృత కలెక్టరేట్‌లో రోడ్లు భవనాలశాఖ పరిధిలో పెండింగ్ రోడ్లు, భవనాల పనుల పురోగతిపై ఆర్అండ్‌బీ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో రోడ్లు బోనాలశాఖ పరిధిలో 12రోడ్లు, 8 భవనాలు (వైద్య కళాశాలతో సహా), ఏడు బ్రిడ్జిల నిర్మాణ పనులు జరుగుతున్నాయని తెలిపారు. రోడ్డు భవనాలశాఖ పరిధిలో పెండింగ్ రహదారి పనులు చేపట్టి త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రజలకు అందుబాటులోకి వచ్చే రోడ్ల నిర్మాణ పనులు నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలన్నారు. వీర్నపల్లి దగ్గర పాఠశాల సమీపంలో సీసీ రోడ్డు నిర్మాణానికి అవసరమైన ఇసుక కేటాయింపులు చేయాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. ఎన్నికల కోడ్ ముగిసినందున అవసరమైన ప్రతిపాదనలు తయారు చేసి పనులు వెంటనే జరిగేలా చూడాలన్నారు. కాంట్రాక్టర్లతో చర్చలు జరిపి పనులు క్షేత్ర స్థాయిలో త్వరగా గ్రౌండ్ అయ్యేలా చూడాలన్నారు. వైద్య కళాశాల పనులు నిర్దిష్ట సమయంలో పూర్తి చేయాలన్నారు. ఆలయ అభివృద్ధి పనులు, అన్నదాన సత్రం, వీర్నపల్లి వద్ద ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ముస్తాబాద్‌లో తహసీల్ కార్యాలయ నిర్మాణం, కోర్టు భవనాల నిర్మాణ పనులకు సంబంధించి టెండర్ ప్రక్రియ త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఆర్అండ్‌బీ ఈఈ వెంకటరమణయ్య, డీఈలు శాంతయ్య, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాల తనిఖీ

రాజన్న సిరిసిల్ల, మార్చి 6 (నమస్తే తెలంగాణ): ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం పబ్లిక్ పరీక్షలు ప్రారంభమైన నేపథ్యంలో గురువారం పలు కేంద్రాలను కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్ తనిఖీ చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, బాలికల జూనియర్ కళాశాలలో కేంద్రాలను సందర్శించారు. పరీక్షల సరళిని పరిశీలించి ఏర్పాట్లు, విద్యార్థుల హాజరుశాతం వివరాలపై ఆరాతీశారు. క్షేత్ర స్థాయిలో ఏమైనా ఇబ్బందులుంటే తమ దృష్టికి తీసుకురావాలని వారు సూచించారు.

ఆయుర్వేద వైద్యం పేరిట మోసం

వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ

రాజన్న సిరిసిల్ల, మార్చి 6 (నమస్తే తెలంగాణ): ఆయుర్వేద వైద్యంతో మొండి రోగాలను నయం చేస్తానంటూ నమ్మించి మోసం చేసిన యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఘటనకు సంబంధించి సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి గురువారం వివరాలు వెల్లడించారు. కర్ణాటక రాష్ట్రం చిక్‌బల్లాపూర్ జిల్లా గౌరిబిదనూరుకు చెందిన అజయ్(20) తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో మోటార్ సైకిల్‌పై తిరుగుతూ పక్షవాతం, ఇతర అనారోగ్య సమస్యలున్న వారిని కలిసి ఆయుర్వేదంతో నయం చేస్తానని నమ్మించాడు. వైద్య ఖర్చుల కోసం ₹10 వేల నుంచి ₹50వేల వరకు వసూలు చేశాడు. కొన్ని మందులను ఇచ్చి తిరిగి మళ్లీ వస్తానని చెప్పి తిరిగిరాలేదు. గురువారం గంభీరావుపేటలో అనుమానాస్పదంగా కనిపించిన అజయ్‌ను ఎస్ శ్రీకాంత్ అదుపులోకి తీసుకుని విచారించగా.. వైద్యం పేరిట మోసం చేస్తున్నట్లు అంగీకరించాడు. గతేడాది గంభీరావుపేట మండలం లింగన్నపేటలో కొడిమోజు ప్రభాకర్‌కు పక్షవాతం తగ్గిస్తానంటూ ₹20వేలు తీసుకునాడు. రాష్ట్రంలో 50మందికి వైద్యం చేస్తానని నమ్మించి.. డబ్బులు వసూలు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. ఈ మేరకు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు.

ప్రతి వాహనానికి అనుమతులు ఉండాలి

- జిల్లా రవాణాశాఖ అధికారి లక్ష్మణ్

వాహనదారులతో మాట్లాడుతున్న జిల్లా రవాణాశాఖ అధికారి లక్ష్మణ్

వేములవాడ, మార్చి 6: రహదారిపై ప్రతి వాహనానికి అన్ని రకాల అనుమతి పత్రాలు కలిగి ఉండాలని జిల్లా రవాణాశాఖ అధికారి లక్ష్మణ్ పేర్కొన్నారను. గురువారం పట్టణంలోని రెండో బైపాస్ రహదారిలో వాహన యజమానులతో మాట్లాడారు. వాహన యజమానులు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ కలిగి ఉండాలన్నారు. వ్యవసాయ ఆధారిత ట్రాక్టర్లను ఇసుక తరలింపునకు వినియోగించడం నిబంధనలకు విరుద్ధమన్నారు. తనిఖీల సమయంలో పట్టుపడితే తగి న చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట ఎంవీఐ వంశీధర్, తదితరులు ఉన్నారు.

గొర్రెపొట్టేల్లు అదృశ్యం

ఎల్లారెడ్డిపేట, మార్చి 6: మండల కేంద్రానికి చెందిన మిర్యాల్‌కార్ శ్రీకాంత్, అతడి బంధువులు రాజేశ్, ఐలోజీ వెంకటాపూర్ మార్కెట్‌లో తొమ్మిది గొర్రెపొట్టెల్లు కొనుగోలు చేసి గ్రామంలోని ఒగ్గు మల్లయ్య మందలో వదిలారు. ఈ నెల 4న మల్లయ్య గొర్రెలను మేతకు తీసుకెళ్లి సాయంత్రం షెడ్డులోకి తీసుకెళ్లే సమయంలో దు గొర్రె పొట్టేల్లు కనిపించలేదు. అదృశ్యమైన గొర్రెపొట్టేల్ల విలువ రూ.50వేల వరకు ఉంటుందని కాపరి మల్లయ్య తెలిపారు. ఈ మేరకు శ్రీకాంత్ ఠాణాలో ఫిర్యాదు చేయగా, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమాకాంత్ తెలిపారు.

బెదిరించిన వ్యక్తిపై కేసు

ఎల్లారెడ్డిపేట, మార్చి 6: రోడ్డు వేస్తే చంపుతానని బెదిరించిన బాకుర్‌పల్లికి చెందిన అజ్మీరా రాజుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమాకాంత్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. ప్రభుత్వ ఆదేశానుసారం బాకుర్‌పల్లిలో అజ్మీరా రాంసింగ్ మంగళవారం సీసీరోడ్డు వేశాడు. అదే రోజు సాయంత్రం తనపొలం నుంచి రోడ్డు ఎందుకు వేశారని తన భార్య లక్ష్మి, కొడుకు సాయికుమార్‌ను అజ్మీరా రాజు ఇష్టారీతిన తిట్టాడంటూ రాంసింగ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు రాజుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అడవిలో నీటి తొట్టెలు

వీర్నపల్లి, మార్చి6: వేసవికాలం సమీపిస్తున్నందున అటవీ జంతువులు సంచరించే ప్రాంతాల్లో నీటి వసతులు కల్పిస్తున్నారు. మండలంలోని బాబాయిచెరువుతండా శివారులోని అటవీ ప్రాంతంలో నీటి తొట్టెలు ఏర్పాటు చేశారు. నాలుగు రోజులకోసారి ట్యాంకర్ల ద్వారా నీటిని నింపుతూ వన్యప్రాణుల దాహాన్ని తీర్చనున్నామని అటవీశాఖ బీట్ అధికారి కిరణ్ తెలిపారు.

దర్గా హఠావో.. వేములవాడ బచావో



వేములవాడ రాజన్న ఆలయ హుండీలో వచ్చిన చీటీ

- చీటీలు రాసి రాజన్న హుండీలో వేసిన భక్తులు

వేములవాడ, మార్చి 6: వేములవాడ రాజన్న ఆలయ హుండీ లెక్కింపు గురువారం ఆలయ ఓపెన్ స్లాబ్‌లో అధికారులు నిర్వహించగా, లెక్కిస్తున్న సమయంలో రాజన్న ఆలయంలోని ''దర్గా హఠావో.. వేములవాడ బచావో'' అంటూ రాసిన చీటీలు లభించాయి. దాదాపు 25కు పైగా చీటీలు రావడంతో సిబ్బంది ఆలయ అధికారులకు అందజేశారు. వాటిని చూసిన అధికారులు తొలగించారు. కొద్దిరోజులుగా రాజన్న ఆలయంలోని దర్గాను తీసేయాలని వివాదం నడుస్తున్న తీరు.. ఇటు రాజన్న ఆలయ హుండీలో చీటీల లభ్యం కావడంతో పోలీసులు అన్ని కోణాల్లో పరిశీలిస్తూ దర్యాప్తు చేస్తున్నారు.

చాయ్ తాగుతూ.. సమస్యలు వింటూ

మండల కేంద్రంలోని టీ తాగుతూ కార్యకర్తలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్

- కార్యకర్తలతో మాట్లాడిన మాజీ ఎమ్మెల్యే రసమయి

ఇల్లంతకుంట, మార్చి 6: మండల కేంద్రంలో టీ స్టాల్ వద్ద చాయ్ తాగుతూ.. మండల కార్యర్తలతో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రమసయి బాలకిషన్ సాగునీటి సమస్యపై ఆరా తీశారు. మండల సమస్యల గురంచి అడిగి తెలుసుకున్నారు. రైతులకు అండగా ఉండానికి మనమందరం సిద్ధంగా ఉండాలన్నారు. ఆయన వెంట జడ్పీ మాజీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు రఘు, నాయకులు శంకర్, తిరుపతిరెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, మహేశ్, సాధుల్, భాస్కర్, సుమన్, తదితరులు ఉన్నారు.

వివాహ వేడుకకు హాజరైన చల్మెడ

వివాహ వేడుకకు హాజరైన చల్మెడ లక్ష్మీనరసింహారావు, నేతలు

రుద్రంగి, మార్చి 6: మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకుడు లావుడ్య మోహన్ సోదరి వివాహ వేడుకతోపాటు, బీఆర్‌ఎస్ నాయకుడు పోసు రమేశ్ కూతురు వివాహానికి బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం, మాజీ ఎంపీపీ గంగం స్వరూపారాణి, నాయకులు గంగం మహేశ్, దేగావత్ తిరుపతి, మంచె రాజేశం, దయ్యాల కమలాకర్, చెప్యాల గణేశ్, కాదాసు లక్ష్మణ్, తలారి నర్సయ్య, ఉప్పులూటి గణేశ్, గెంటె ప్రశాంత్, గొల్లెం నర్సింగ్, ఆకుల గంగాధర్, బాబా పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలను వినియెగించుకోవాలి

సిరిసిల్ల టౌన్, మార్చి 8: మెప్మా ద్వారా కల్పిస్తున్న ఉపాధి అవకాశాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీవో శేషాద్రి పేర్కొన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని బతుకమ్మ ఘాట్ వద్ద మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వీధి విక్రయ కేంద్రం(టీ స్టాల్)ను ఆయన ప్రారంభించారు. ఇక్కడ మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, మహిళలు, తదితరులు ఉన్నారు.

రోడ్డుకు మరమ్మతులు

కోనరావుపేట, మార్చి 6: నిమ్మపల్లి నుంచి మరిమడ్లకు వెళ్లే ప్రధాన రహదారి గుంతల మయం కావడంతో లంబాడీల ఐక్యవేదిక రాష్ట్ర ఇన్‌చార్జి బానోత్ నరేశ్‌నాయక్ మరమ్మతులు నిర్వహించారు. గుంతలు పడి వాహనదారులకు ఇబ్బందిగా మారిన చోట ట్రాక్టర్ల సాయంతో మట్టిని పోయించి చదును చేయించారు. దీంతో వాహనదారులు, తండావాసులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

బార్ అసోసియేషన్ సంతాపం

కార్యాలయంలో సంతాపం తెలుపుతున్న న్యాయవాదులు

వేములవాడ, మార్చి 6: వేములవాడ బార్ అసోసియేషన్ సీనియర్ న్యాయవాది చెర్ల ఆనంద్ కుమార్ మృతిపై గురువారం బార్ అసోసియేషన్ కార్యాలయంలో గురువారం సంతాపం తెలిపారు. బార్ అసోసియేషన్ హాల్‌లో ఆనందర్‌కుమార్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించినట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుడిసె సదానందం తెలిపారు. ఇక్కడ ఏజీపీలు పుప్పాల భానుకృష్ణ, బొడ్డు ప్రశాంత్ కుమార్, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అవధూత రజనీకాంత్, న్యాయవాదులు నాగుల సత్యనారాయణ, రేగుల దేవేందర్, విద్యాసాగర్‌రావు, పిట్టల మనోహర్, పోత్తూరి అనిల్‌కుమార్, కోడిమ్యాల పురుషోత్తం, కిశోర్‌రావు, గోపికృష్ణ, పెంట రాజు, నక్క దివాకర్, మాదాసు దేవయ్య, గుజ్జ మనోహర్, బీమా మహేశ్, నరాల శ్రీనివాస్, రేగుల రాజ్‌కుమార్, మనోహర్, మహేశ్, అనిల్, మల్లేశ్, జనార్దన్, శ్రీకాంత్, ఆదిత్య, నాగేంద్రబాబు, మహిళా న్యాయవాది అన్నపూర్ణ, తదితరులు ఉన్నారు.

ఇంటర్ పరీక్షలకు ఇద్దరు గైర్హాజరు

ఇల్లంతకుంట, మార్చి 6: మండల కేంద్రలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ వార్షిక పరీక్షలకు గురువారం ప్రశాంత వాతావరణంలో ప్రారంభమైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి తెలిపారు. 244మంది విద్యార్థులకు గానూ 242మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా, ఇద్దరు గైర్హాజరైనట్లు ఆయన చెప్పారు.

సద్వినియోగం చేసుకోవాలి

ముస్తాబాద్, మార్చి 6: కల్వకుంట్ల రమాదేవి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు డాక్టర్ లక్ష్మణ్‌రావు తెలిపారు. మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో వారంపాటు శంకర నేత్రాలయం చెన్నై వారి సౌజన్యంతో శిబిరం నిర్వహిస్తున్నామని తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి

వేములవాడ, మార్చి 6: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలపై అసెంబ్లీలో చర్చించి పరిష్కరించాలని గ్రామ పంచాయతీ కార్మికుల యూనియన్ జిల్లా కార్యదర్శి అన్నల్‌దాసు వేణు కోరారు. తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా గురువారం వేములవాడలోని రెండో బైపాస్‌లో నిరసన వ్యక్తం చేశారు. నిరసన కార్యక్రమం వద్దకు వచ్చిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. కార్మికుడికి కనీస వేతనం రూ.26 వేలు, రూ.10లక్షల వరకు కార్పొరేట్ స్థాయి వైద్యం, రూ.10లక్షల బీమా కల్పించాలని వినతిపత్రం అందజేశారు. ఇక్కడ జీపీ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మల్యాల నర్సయ్య, మండలాధ్యక్షులు వర్కోలు మల్లయ్య, బూర శ్రీనివాస్ గౌడ్, అక్కల అంజాగౌడ్, లోకిని శ్రీనివాస్, సందెల మహేశ్, ముదిగం అనిల్, నారాపురం నర్సయ్య, న్యాత నర్సయ్య, కంసాని రవీందర్, తదితరులు ఉన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

- టీజీవో అధ్యక్షుడు సమర్సన్, డోర్స్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం

కలెక్టరేట్, మార్చి6: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని టీజీవో అధ్యక్షుడు సమర్సన్, డోర్స్ (డిస్టిక్ ఆఫీసర్స్ ఆఫ్ రాజన్నసిరిసిల్ల) జిల్లా పశు వైద్యాధికారి రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. మహిళా, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలను పురస్కరించుకొని గురువారం సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో మహిళలకి అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీరాజం మాట్లాడుతూ, మహిళలందరికీ సమానమైన హక్కులతో పాటు ప్రత్యేకమైన చట్టాలను కూడా ప్రభుత్వం కల్పిస్తుందని వివరించారు. మహిళలు ఏ సందర్భంలోనైనా వేధింపులను ఎదుర్కొంటే వారికి 181టోల్‌ఫ్రీ నంబర్ ద్వారా వైద్య, న్యాయం, పోలీస్, కౌన్సెలింగ్, షెల్టర్ వంటి సాయాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నిర్మలాదేవి, మహి ళా సాధికారత కేంద్రం కోఆర్డినేటర్ రోజా, దేవిక సఖి ఇన్‌చార్జి విజయ ఉన్నారు.

నర్సింగ్ కాలేజీలో...

సఖి ఆధ్వర్యంలో నర్సింగ్ కాలేజీ కేంద్రంలోనూ మహిళలకు విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. కార్యక్రమంలో సిరిసిల్ల ఇన్‌చార్జి ఆర్డీవో ఆర్‌వీ రాధాబాయ్, డీఏవో అఫ్జల్‌బేగం, మిషన్ భగీరథ ఈఈ జానకి, గెజిటెడ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు, డీఆర్‌డీవో శేషాద్రి పాల్గొన్నారు.

జీవోల డ్రాఫ్టలను సవరించాలి

కలెక్టరేట్, మార్చి 6: ప్రభుత్వం విడుదల చేసిన కనీస వేతనాల జీవోల డ్రాఫ్టులను సవరించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా సీఐటీయూ నాయకులు కోరారు. కనీస వేతనం రూ.26వేలు నిర్ణయించాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టి కలెక్టరేట్ ఏవో రాంరెడ్డికి వినతిపత్రం అందించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై జిల్లాలోని ఎంప్లాయిమెంట్స్ పవర్‌లూం, గార్మెంట్, బీడీ పరిశ్రమలలో పనిచేస్తున్న కార్మికులందరూ పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఇక్కడ సీఐటీయూ జిల్లా నాయకులు జిందం కమలాకర్, బెజుగం సురేశ్, బత్తుల రమేశ్, తదితరులు ఉన్నారు.

లింగనిర్ధారణ చేయడం నేరం

సిరిసిల్ల టౌన్, మార్చి 6: లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర మాతాశిశు సంరక్షణ అధికారి డాక్టర్ సూర్య శ్రీరావు హెచ్చరించారు. గురువారం పట్టణంలోని పలు స్కానింగ్ కేంద్రాలను ఆమె తనిఖీ చేశారు. రేడియోలజిస్ట్, గైనకాలజిస్ట్ వైద్యులు తెలంగాణ మెడికల్ కౌన్సిల్‌లో తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. రికార్డులు, ఫారం ఎఫ్‌లు పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఇక్కడ ప్రభుత్వ దవాఖాన గైనకాలజిస్ట్ డాక్టర్ సుచిత్ర లక్ష్మి, జిల్లా పీవోఎంహెచ్ఎన్ ఇన్‌చార్జి డాక్టర్ సంపత్‌కుమార్, డిప్యూటీ డెమో రాజ్‌కుమార్, హెచ్ఈ బాలయ్య ఉన్నారు.

లైవ్ స్టాక్ అధికారి సస్పెన్షన్

- ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్

రాజన్న సిరిసిల్ల, మార్చి 6 (నమస్తే తెలంగాణ): నకిలీ వైద్య సర్టిఫికెట్లు సృష్టించిన వెటర్నరీ లైవ్‌స్టాక్ అధికారి కొమురయ్యను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి పీవీసీ కార్యాలయంలో వెటర్నరీ లైవ్ స్టాక్ అధికారిగా పని చేస్తున్న జె కొమురయ్య 19జనవరి 2024న మెడికల్ ఇన్‌వాలిడేషన్ కోసం ఉన్నతాధికారులకు దరఖాస్తు చేసుకున్నాడు. కరీంనగర్‌లోని సన్‌షైన్ దవాఖానలో జారీ చేసిన సర్టిఫికెట్లను సమర్పించాడు. ఆయనపై అనుమానంతో అధికారులు విచారణ చేపట్టారు. సన్‌షైన్ దవాఖాన నుంచి సమర్పించిన సర్టిఫికెట్లు నకిలీవని తేలడంతో అధికారులు కలెక్టర్‌కు నివేదించారు. తప్పుడు ప్రతాలు సృష్టించి అధికారులను తప్పుదోవ పట్టించిన కొమురయ్యపై ఎల్లారెడ్డిపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయడంతోపాటు ఆయనను సస్పెండ్ చేస్తున్నట్లు కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

విద్యార్థుల ప్రతిభ

వేములవాడ రూరల్, మార్చి 6: అగ్రహారంలోని ఎస్ఆర్ఆర్ డిగ్రీ కళాశాల రసాయనశాస్త్ర విద్యార్థులు రాష్ట్రస్థాయి జిజ్ఞాస పోటీల్లో ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపాల్ శంకర్, రసాయన శాస్త్ర విభాగ అధిపతి వై కరుణ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, రసాయనశాస్త్ర సహాయ ఆచార్యులు కెవై కరుణ పర్యవేక్షణలో విద్యార్థులు జీ కిరణమై, సీహెచ్ సిద్ధార్థ, ఎం వెంకట్, లావణ్య, శివాని ఎనాలసీస్ ఆఫ్ ఫైటో కెమికల్స్ ఇన్ సమ్ వెజిటబుల్స్ ఫ్రూట్స్ అంశంపై రూపొందించిన స్టడీ ప్రాజెక్ట్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టును హైదరాబాద్ రీసెర్చ్ రూసా సెంటర్‌లో విద్యార్థులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ సమర్పించారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు, అధ్యాపకులు కరుణను అభినందించారు. ఇక్కడ వైస్ ప్రిన్సిపాల్ లావణ్య, కృష్ణ, ప్రసాద్, శోభారాణి, అధ్యాపకులు, తదితరులు ఉన్నారు.

వాటర్ బాటిల్స్ వితరణ

ముస్తాబాద్, మార్చి 6: పోత్గల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వరి చంద్రమోహన్ జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు గురువారం పాఠశాలలో విద్యార్థులకు 40వాటర్ బాటిల్స్ వితరణ చేశారు. ఇక్కడ హెచ్ఎం సురభి రాధాకిషన్‌రావు, కోల కృష్ణ, వరి వెంకటేశ్, వరి వికాస్, కస్తూరి కార్తీక్, మీస సంజీవ్, ఎదునూరి గోపికృష్ణ, మహేశ్, తదితరులు ఉన్నారు.

వర్గీకరణ వెంటనే అమలుచేయాలి

వేములవాడ రూరల్, మార్చి 5: ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని వేములవాడ మండల డప్పు కళాకారులు మహాప్రదర్శన నిర్వహించి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర నాయకుడు గుండా థామస్ మాట్లాడుతూ, జస్టిస్ షమీమ్ అక్తర్ ఇచ్చిన నివేదికలో ఉన్న లోపాలను సవరించి, ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలన్నారు. మాదిగల నుంచి ఇద్దరికి రాష్ట్ర మంత్రివర్గంలో స్థానం కల్పించాలన్నారు. ఎస్సీ వర్గీకరణ ఏబీసీడీలుగా వర్గీకరించాలన్నారు.

ఆత్మగౌరవ డప్పు మహా ప్రదర్శన

కోనరావుపేట, మార్చి 6: మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ యెలగందుల భిక్షపతి అధ్వర్యంలో మండల కేంద్రంలో మాదిగల ఆత్మగౌరవ డప్పు మహా ప్రదర్శన నిర్వహించారు. ఈ మేరకు తహసీల్దార్ విజయ్‌ప్రకాశ్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం ఆమోదించిన ఎస్సీ వర్గీకరణ నివేదికలో ఉన్న లోపాలను సవరించి అన్ని కులాలకు న్యాయం చేయాలని కోరారు. ఇక్కడ మండల గౌరవాధ్యక్షుడు తైదల రాజయ్య, ఉపాధ్యక్షుడు కుమ్మరి దిలీప్, తదితరులు ఉన్నారు.

పరీక్ష సామగ్రి అందజేత

కోనరావుపేట, మార్చి6: ధర్మారం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని హాస్టల్ నిర్వాహకుడు శ్రీనివాస్ సోమవారం అందజేశారు. విద్యార్థులు పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. ఇక్కడ పోట్లపల్లి గోపాల్‌రావు, తదితరులు ఉన్నారు.

రుద్రంగి, మార్చి 6: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు బీఆర్‌ఎస్ యువ నాయకుడు గెంటె ప్రశాంత్ అందించిన పరీక్ష ప్యాడ్లు, పెన్నులను నాయకులతో కలిసి సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం, మాజీ ఎంపీపీ గంగం స్వరూపారాణి గురువారం పంపిణీ చేశారు. ఇక్కడ ఇన్‌చార్జి హెచ్ఎం, నాయకులు గంగం మహేశ్, మంచె రాజేశం, మాడిశెట్టి ఆనందం, దయ్యాల కమలాకర్, చెప్యాల గణేశ్, దుబ్బ రవి, కాదాసు లక్ష్మణ్, ఉప్పులూటి గణేశ్, బాబా, మల్లేశం, తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

గంభీరావుపేట, మార్చి6: లింగన్నపేట జడ్పీహెచ్ఎస్‌లో ఎల్‌వీ ప్రసాద్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. 24మందికి కళ్లద్దాలు అందించారు.

రైతులకు సీపీఎం మద్దతు

దీక్ష చేస్తున్న రైతులకు మద్దతు తెలుపుతున్న సీపీఎం నాయకులు

ఇల్లంతకుంట, మార్చి 6: పెద్దలింగాపూర్ గ్రామంలో రిలే నిరాహార దీక్ష చేస్తున్న రైతులకు గురువారం జిల్లా సీపీఎం నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి గన్నారం నర్సయ్య మాట్లాడుతూ, కాళేశ్వరం ప్యాకేజీ 11/6 కాలువ నిర్మాణంలో భాగంగా భూసేకరణ చేసి నిర్లక్ష్యంగా విడిచిపెట్టారన్నారు. తద్వారా ఇల్లంతకుంట మండంలోని నాలుగు గ్రామాలు, తంగళ్లపల్లి మండలంలోని ఎనిమిది గ్రామాల రైతులకు సాగునీరు అందలేదన్నారు. ఈ కాలువ నిర్మాణం పూర్తయితే 12 గ్రామాలలో సుమారుగా 9,500ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. ఈ ప్యాకేజీలో భాగంగా రిలేనిరామార దీక్ష చేస్తున్న రైతులకు తాము పూర్తి మద్దతు చేస్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే స్పం దించి కాలువ నిర్మాణం చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు జివ్వాజి విమల, సీనియర్ నాయకులు రాయమల్లు, గురిజాల శ్రీధర్, అశోక్, ప్రభాకర్, మధు, తదతరులు ఉన్నారు.

బావిలోపడి యువకుడి మృతి

రజినీకాంత్(ఫైల్)

ఇల్లంతకుంట రూరల్, మార్చి 6: పెద్దలింగాపూర్‌కు చెందిన శీలం రజినీకాంత్(26) ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందాడు. ఎస్ఐ శ్రీకాంత్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. రజినీకాంత్ తన బైక్‌పై సిరిసిల్ల నుంచి స్వగ్రామానికి వస్తున్న క్రమంలో గ్రామ సమీపంలోని ప్రాథమిక పాఠశాల దగ్గర ఉన్న బావిలో అదుపు తప్పి పడి మృతిచెందాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఘటనా స్థలానికి ఎస్ఐ చేరుకుని మృతదేహాన్ని బావిలో నుంచి బయటకు తీశారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.